ప్రజా సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

- అల్వాల్ ఉపకమిషనర్‌తో 'సాక్షి ఫోన్ ఇన్'
- పరిష్కారానికి సత్వర ఆదేశాలు

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారానికి 'సాక్షి' జీహెచ్‌ఎంసి అల్వాల్ సర్కిల్ అల్వాల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో గురువారం నిర్వహించిన 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమానికి ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువల వచ్చాయి. ప్రజా సమస్యలపై ఉప కమిషనర్ స్పందిస్తూ.. చాలా సమస్యలకు సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చెరువుల సుందరీకరణ చేపట్టండి..

గొలుసుకట్టు చెరువుల నిర్మాణంతో అల్వాల్ పట్టణం ఏర్పడింది. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోకుండా నాటి పాలకులు చెరువులను పరిరక్షించారు. క్రమేణ ఆక్రమణకు గురౌతుండటంతోపాటు చెరువులు మురికి కుంటలుగా మారుతున్నాయి. పట్టించుకోండి.

- దండుగుల వెంకటేష్ మచ్చబొల్లారం, సురేందర్‌రెడ్డి, అల్వాల్

చెరువుల పరిరక్షణకు చర్యలు : డీసీ

అల్వాల్‌లోని కొత్త చెరువు, చినరాయుడి చెరువు, మోత్కుల కుంట చెరువులను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల జోనల్ కమిషనర్ పర్యటించి పలు సూచనలు చేశారు. చెరువులోని గుర్రపు డెక్కను తొలగించడానికి నూతన కాంట్రాక్టర్‌కు బాధ్యతలను అప్పగించాం. మురుగునీటిని శుభ్రం చేసేందుకు చెరువు వద్ద సివరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తాం.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు..

మచ్చబొల్లారం జ్యోతినగర్, తుర్కపల్లిలో ఇటీవల జరిగిన బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనుల కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రోడ్డుకు ఇరువైపుల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుండంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ఎం. సుజాత, మచ్చబొల్లారం జ్యోతినగర్, సురేష్‌కుమార్ తుర్కపల్లి

రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం : డీసీ

వర్షపునీరు, మురుగు సమస్య పరిష్కారం కోసం పలుచోట్ల ఇటీవల బాక్స్‌డ్రైన్ పనులు చేపట్టాం. త్వరలో రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

మూడేళ్లుగా రోడ్డు అధ్వాన్నంగా ఉంది..

పాత అల్వాల్ దుర్గా వైన్స్ ఎదురుగా ఉన్న రోడ్డు, ఇక్కడ నుండి వీబీఆర్ ఫంక్షన్‌హాల్‌కు వెళ్లే రహదారి సైతం గత మూడేళ్లుగా అధ్వానంగా ఉంది. పట్టించుకోవడం లేదు.

- రాజుమహేందర్, పాత అల్వాల్

రోడ్డు మరమ్మతులు చేపడుతాం : డీసీ

కాలనీలో పర్యటించి రోడ్డు మరమ్మతు పనులను చేపట్టి సమస్యలను పరిష్కరిస్తాం.

నూతన భవన నిర్మాణాలకు నిబంధనలు పాటించకుండా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు..

భవన నిర్మాణాల కోసం జీహెచ్‌ఎంసీ నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. దీనికి ఉదాహరణగా పాత అల్వాల్ భవానీనగర్‌లో పరిశీలించండి. షెట్‌బ్యాక్స్ పాటించకపోగా.. రోడ్డును ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తున్నారు. దీనికి తోడు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు.

- నారాని నాగరాజు, భవానీనగర్, ఓల్డ్ అల్వాల్

తగిన చర్యలు తీసుకుంటాం : డీసీ

నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటాం.

గంగా ఎన్‌క్లేవ్‌లో సమస్యలపై...

జొన్నబండ గంగా ఎన్‌క్లేవ్‌లో అధ్వాన్నంగా రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రైనేజీ, పారిశుధ్య సమస్య నెలకొంది. దయచేసి పట్టించుకోండి.

- జోసఫ్‌రెడ్డి, జొన్నబండ గంగా ఎన్‌క్లేవ్

త్వరలోనే ప్రారంభిస్తాం : డీసీ

నూతనంగా ఏర్పడిన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు తగిన ప్రాధాన్యతనిస్తూ.. క్రమంగా చర్యలు చేపడుతున్నాం. గంగా ఎన్‌క్లేవ్‌లో సైతం త్వరలో పనులు ప్రారంభం అవుతాయి.

ఫాగింగ్ చేయ్యడం లేదు..

కాలనీలలో డెంగీ, మలేరియా కేసులు అధికమవుతున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. గత 45 రోజుల నుంచి మా కాలనీలలో ఫాగింగ్ చేయడం లేదు.

- మహేందర్‌రెడ్డి, హెచ్‌ఎంటీ, ఆఫీసర్స్ కాలనీ

ఎంటమాలజీ విభాగానికి వెంటనే ఆదేశాలు : డీసీ

నిర్దేశించుకున్న సమయం ప్రకారం కాలనీల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, సత్వరమే హెచ్‌ఎంటీ కాలనీలో ఫాగింగ్ చేయాలని ఎంటమాలజీ విభాగానికి ఆదేశాలు జారీ చేశాం.

రోడ్లన్నీ బురదమయం..

కౌకూర్ గృహతార కాలనీలో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. రోడ్లపై ఉన్న గుంతలలో చిన్నారులు, బాటసారులు పడి ప్రమాదాలకు గురువుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి సమస్య తీవ్రమవుతుంది. కాలనీలో వీధి దీపాలు లేవు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు సైతం ఏర్పాటు చేయలేదు. వెంకటాపురం డివిజన్ మారుతీనగర్ బిడ్జి వద్ద, ఇతర ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలతో రోడ్లపై వర్షపు నీరు నిలుస్తోంది. డ్రైనేజీ సమస్య అధికంగా ఉంది.

- అజిత్‌కుమార్, వాసవి, గృహతరకాలనీ, కౌకూర్, విఘ్నేశ్వర్‌రెడ్డి, మారుతీనగర్

దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు చర్యలు : డీసీ

రోడ్ల మరమ్మతులకు తగిన చర్యలు తీసుకుంటాం. విద్యుత్ స్తంభాలు, వీధిలైట్ల ఏర్పాటు తదితర పనులకు విద్యుత్ అధికారులకు సూచనలు చేస్తాం.

ఏళ్ల తరబడి మట్టిరోడ్డులోనే ప్రయాణం చేస్తున్నాం..

చాలా ఏళ్లుగా మట్టిరోడ్డులోనే ప్రయాణం చేస్తున్నాం. నూతనంగా ఏర్పడిన కాలనీల్లో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. మచ్చబొల్లారంకు ప్రధాన రహదారి అయిన సెలెక్ట్ టాకీస్ నుంచి బాలాజీ రైస్‌మిల్ వరకు వెళ్లాలంటే నరక యాతన అనుభవించాల్సి వస్తుంది.

- ఆనంద్, మచ్చబొల్లారం

ఉన్నతాధికారులు పరిశీలించారు : డీసీ

రెండు రోజుల క్రితం జోనల్ కమిషనర్, ఉన్నతాధికారులు మచ్చబొల్లారం రోడ్డును పరిశీలించారు. త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

మురుగునీరు ఇళ్లలోకి వస్తుంది..

జొన్నబండ పార్కు సమీపంలో నిర్మించిన అపార్ట్‌మెంట్ నుంచి మురుగునీరు రోడ్డుపై పారుతూ.. ఇళ్లలోకి వస్తుంది. అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చే ముందు మౌలిక వసతులను పరిగణలోకి తీసుకోవాలి.

- అరవింద్, జొన్నబండ

సమస్య పరిశీలకు ఆదేశాలు : డీసీ

సమస్యను పరిశీలించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.



ఫోన్‌లో సమస్యలు వింటున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్యక్రమానికి హాజరైన అధికారులు

కుక్కల బెడద అధికంగా ఉంది..

మచ్చబొల్లారం, బటన్‌గూడ సమీపంలోని రైల్వే ఎంప్లాయిస్ కాలనీ, అల్వాల్ హిల్స్‌లలో కుక్కల బెడద అధికంగా ఉంది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై వెళ్లాలంటే మహిళలు, చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

- విఘ్నేశ్వర్‌రెడ్డి, రైల్వే ఎంప్లాయిస్ కాలనీ, శ్రీనివాస్ అల్వాల్ హిల్స్

9000961962కు ఫోన్ చేయండి : డీసీ

కుక్కల బెడద అధికంగా ఉంటే వెటర్నటీ అధికారులకు సమాచారం ఇవ్వండి. వారు స్పందించకుంటే నాకు ఫోన్ చేయండి.

ఇళ్ల మధ్య గోశాలతో ఇబ్బందులు..

పంచశీల కాలనీలో ఏర్పాటు చేసిన గోశాల వలన పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతుంది. దోమలు, క్రిమి కీటకాలు పెరుగుతున్నాయి. నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.

- జాన్సీ, పంచశీల కాలనీ.

వెటర్నిటీ అధికారులకు ఫిర్యాదు చేయండి : డీసీ

గోశాలతో ఇబ్బంది కలిగితే వెటర్నిటీ అధికారులకు ఫిర్యాదు చేయండి. వారు తగిన చర్యలు తీసుకుంటారు.

పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంది..

చంద్రానగర్ కాలనీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. రోడ్లపై చెత్త, చెదారం పేరుకుపోతోంది. రోడ్డుకు ఇరువైపుల గడ్డి, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. తగిన చర్యలు తీసుకోండి.

- ఇంద్రారెడ్డి. చంద్రానగర్

పారిశుధ్య అధికారులకు ఆదేశాలు : డీసీ

పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

భూదేవినగర్‌లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంది..

భూదేవినగర్‌లో గత కొంతకాలంగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. పారిశుద్ధ్య సిబ్బంది రోడ్లు ఊడ్చి చెత్త కుప్పలను ఖాళీ ప్రదేశాల్లో పారవేస్తున్నారు. దీనికి తోడు రోడ్లు గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉన్నాయి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అల్వాల్ పంచశీల కాలనీలో పారిశుద్ధ్యం కుంటు పడింది. ప్రతిరోజు కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పరచండి.

- బాబురావు, భూదేవినగర్, భరత్‌రెడ్డి, పంచశీల కాలనీ

పారిశుద్ధ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం : డీసీ

వెంకటాపురం భూదేవినగర్, అల్వాల్ పంచశీల కాలనీలలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి సంబంధిత శానిటేషన్ అధికారులను అప్రమత్తం చేస్తాం. ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు పారవేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. రోడ్ల మరమ్మతులు చేపడతాం. అల్వాల్ పంచశీల కాలనీలో కుంటుపడిన పారిశుద్ధ్యంపై సత్వర చర్యలు తీసుకుంటాం. సంబంధిత శానిటేషన్ అధికారులను అప్రమత్తం చేస్తాం.

కాలనీలో డ్రైనేజీ నీరు ప్రవహిస్తుంది..

దినకర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ నీరు పొంగి పార్లుతూ.. కాలనీలో చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దీని కారణంగా దుర్వాసన, దుర్గంధం వెదజల్లుతోంది.

- అమర్‌నాథ్, దినకర్‌నగర్

జలమండలి అధికారులకు సమచారం ఇస్తాం : డీసీ

దినకర్‌నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఉప్పల్ ఎమ్మెల్యేతో లక్ష్మీనరసింహ కాలనీ ప్రతినిధులు

కుషాయిగూడ: కాలనీ అభివృద్ధికి తన తోడ్పాటునందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన చర్లపల్లి డివిజన్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీ సమస్యలు, అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు సీహెచ్.నరసింహా, ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, శ్రీనివాస్, పరమేష్‌చారి, దాము, కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు మహేష్‌గౌడ్ ఉన్నారు.

కార్పొరేటర్ పర్యటన



శివసాయినగర్ ఫేస్-2లోని రహదారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయి నగర్ ఫేస్-2 కాలనీలో గురువారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వర్షం పడితే కాలనీలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని కార్పొరేటర్‌కు తెలిపారు. వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. స్థానికనేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కాలనీవాసులు బిక్షపతి, ప్రసాద్, రమేష్, మహేష్, నర్సింహ్మ, కల్యాణి, సఫీయా, స్వాతి, మాధవి, భార్గవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా..



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్: భరత్‌నగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలకు గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో అమ్మవారి ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. అమ్మవారిని ఆరాధిస్తే శుభాలు కలగడమే కాకుండా కష్టాలు దూరమవుతాయన్నారు. ఆలయ అధ్యక్షుడు సూరం రామ్‌రెడ్డి, కోశాధికారి జానకయ్య, బీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రజకుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

రామంతాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెనుకబడిన తరగతులకు రూ.92 కోట్లు ప్రకటించడానికి స్వాగతిస్తున్నామని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య అన్నారు. రజకుల సంక్షేమానికి తగిన నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఉప్పల్ బీరప్పగడ్డ సీఐటీయూ కార్యాలయంలో గురువారం మేడ్చల్ జిల్లా రజక వృత్తిదారుల సంఘం కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఎస్.సుభద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రజక సొసైటీలకు రుణాలు, వృత్తిదారులకు రూ.10 లక్షల వరకు ఆర్థికసాయం అందించేలా జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు ఉపేందర్, రవి, భాస్కర్, స్వరూప, ఈశ్వర్, లింగం, క్రాంతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


బోనాలను వైభవంగా నిర్వహిస్తాం



బోనాల ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న మేయర్

బోడుప్పల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాలను వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ బంగారు మైసమ్మ ఆలయం వద్ద గురువారం బోనాల ఉత్సవాల ఏర్పాట్లను మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు పెద్ద పండుగ అయిన బోనాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ్మ, భూక్యా సుమన్‌నాయక్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, నేతలు కొత్త కిశోర్‌గౌడ్, దానగల్ల యాదగిరి, బొబ్బల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో థీమ్ పార్కు అభివృద్ధి



పెండింగ్ పనులపై ఆరా తీస్తున్న అడిషనల్ కమిషనర్

మల్లాపూర్: థీమ్ పార్కులో పెండింగ్ పనులను సరైన ప్రణాళికతో త్వరితగతినా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని జీహెచ్‌ఎంసీ చీఫ్ హార్టికల్చరర్ ఆఫీసర్, అడిషనల్ కమిషనర్ డాక్టర్.సునందారాణి అన్నారు. గురువారం మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న థీమ్ పార్కును స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. వాకింగ్‌ట్రాక్, క్రీడా పరికరాలు, విద్యుద్దీకరణ వంటి పెండింగ్ పనులను త్వరితగతన పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ కోరారు. హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, మేనేజర్ లోకేష్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

మేడిపల్లి: పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం కమీషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులు, రిసెప్షన్, పెట్రోలింగ్, పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, మేడిపల్లి పీఐ గోవింద్‌రెడ్డి ,ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్ కావేరీనగర్‌లో నివసించే ప్రశాంతి, శ్రీను భార్యభర్తలు. కాగా వీరికి ముగ్గురు సంతానం. వీరిది ప్రకాశంజిల్లా ఎస్.ఎన్. పాండు మండలం, చిల్కపాడు గ్రామం పదేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి చిలుకానగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీను టైల్స్ పని చేస్తుండేవాడు. పెళ్లైనప్పటి నుంచి మద్యానికి బానిసై అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. 24న పనికి వెళ్లకుండా ఇంట్లో ఉండగా.. భార్య కుమారుడి ఆరోగ్యం దెబ్బతినడంతో ఆసుపత్రికి తీసుకెళ్లింది. రాత్రి తిరిగి ఇంటికొచ్చిన ఆమె భర్తకు ఫోన్ చేసినా సమాధానం రాలేదు. అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. దీంతో స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి 108కు సమాచారం ఇవ్వగా.. పరీక్షించిన సిబ్బంది మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు లక్ష్మీభవాని ఆలయ వార్షికోత్సవం

రామంతాపూర్: చిన్నచెరువు ప్రాంగణంలోని శ్రీ గంగా లక్ష్మీభవాని ఆలయంలో అమ్మవారి ద్వాదశ వార్షికోత్సవ వేడుకలు నేటి నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, అధ్యక్షులు దీటి మల్లయ్య, పూస సత్తయ్యలు గురువారం తెలిపారు. ఈ వేడుకల్లో అమ్మవారికి ఉత్సవం బోనాలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొంటారని వివరించారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్

బోడుప్పల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనతో పాటు డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతిగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి పనిచేసే లక్షణాలను అలవర్చుకునేలా నేర్పించాలన్నారు. కేవలం చదువుకే పరిమితం చేయకుండా వారిని అన్ని రకాల క్రీడల్లో రాణించేలా ప్రత్యేక తర్ఫీదును ఇవ్వాలన్నారు. పాఠశాల నిర్వాహకులు గంగరాజు, విజయకుమారి మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతిగౌడ్‌లను అభినందించి సత్కరించారు. 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కృష్ణమాచారి

అల్వాల్: అల్వాల్ జలమండలి మేనేజర్‌గా ఎస్.కృష్ణమాచారి పదవీబాధ్యతలు చేపట్టారు. మల్లికార్జుననాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పదవీబాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఎస్.కృష్ణమాచారిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ, భీమారావు, శేఖర్, నాయకులు సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అరుణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన

అల్వాల్: దోమలతో వచ్చే వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ జితేంద్రనాథ్ అన్నారు. గురువారం మచ్చబొల్లారం డివిజన్‌లోని కృష్ణానగర్, దిల్లుబస్తీ తదితర ప్రాంతాల్లో వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధుల నివారణకు అవగాహన కార్యక్రమాన్ని అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్ మంజుల, ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ యాంటీ లార్వల్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు, స్టిక్కర్లతో ప్రచారం చేశారు. కాలనీలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు.

బోనాలకు ఆహ్వానం

గౌతంనగర్: సాయినగర్‌లో 29న రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగే బోనాల వేడుకలు, ఫలహారం బండి (పలారం) ఊరేగింపునకు హాజరు కావాలని కోరుతూ.. గురువారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌రావుకు రాజుముదిరాజ్ ఆహ్వానపత్రాన్ని అందజేశారు.



మైనంపల్లికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు 'వ్యాక్సినేషన్ డ్రైవ్'

మల్లాపూర్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో మెదడువాపు రాకుండా ముందస్తుగా విద్యార్థులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. 'పందిని కుట్టిన దోమలు మనుషులకు కుడితే మెదడువాపు వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు'. ఈ వ్యాధి రాకుండా ముందుస్తుగానే ప్రభుత్వం విద్యార్థులకు వ్యాక్సిన్ ఇస్తుందన్నారు. తినేముందు సబ్బుతో చేతులు కడుకుంటే అనేక రోగాలు రాకుండా అరికట్టవచ్చన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులందరికీ ఈ టీకాను వేయనున్నట్లు వివరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో కుడా వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను చేపడతామన్నారు. ఏఎన్ఎం వెంకటమ్మ, ప్రధానోపాధ్యాయులు యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి



కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్



కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో..

విద్యార్థులు వ్యాక్సిన్ వేసుకోవాలి..

మౌలాలి : 9 ఏళ్ల నుంచి 15 ఏళ్లున్న పిల్లలకు మెదడువాపు, పక్షవాతం రాకుండా ముందస్తు జాగ్రత్తగా మౌలాలి డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో వాక్సిన్ ఇచ్చారు. మొదటి రోజు ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. బస్తీ దవాఖాన ఇన్‌చార్జి డాక్టర్ రిషిత, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి సమక్షంలో విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేశారు. ప్రైవేటుగా రూ.2,000 నుంచి రూ.3 వేల వరకు ఖరీదైన వ్యాక్సిన్‌ను కేంద్ర ప్రభుత్వం పిల్లల కోసం ఉచితంగా పంపిణీ చేసిందని ఈ సందర్భంగా కార్పొరేటర్ వివరించారు.

మల్కాజిగిరి: మెదడువాపు వ్యాధి రాకుండా ముందస్తుగా జేఈ టీకాను తప్పనిసరిగా విద్యార్థులు తీసుకోవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. జేఈ టీకాలు వేసే కార్యక్రమాన్ని మౌలాలి రైల్వే క్వార్టర్స్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు (19 ఏళ్లలోపు) ప్రభుత్వం టీకా ఉచితంగా అందజేస్తుందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శోభరాజ్, హెల్త్ సూపర్ వైజర్స్ ప్రకాష్, మాధవి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 15 వరకు (సెలవు దినాలు, ఆదివారాలు మినహాయించి) ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతుందని డీడీఎంహెచ్‌ఓ తెలిపారు.

విధిగా టీకా వేయించండి..

కుషాయిగూడ: విధిగా టీకా వేయించి పిల్లలను విషజ్వరాల నుంచి రక్షించుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. గురువారం ఆయన కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో జేఈ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రెయిన్ ఫీవర్‌గా పిలిచే జపనీస్ ఎన్సెఫాలిటిస్ (జేఈ) సోకిన దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 4,86,037 మంది పిల్లలకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు వేదికగా టీకాలు వేయాలని నిర్ణయించామన్నారు. జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డాక్టర్ సరస్వతి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ : మెదడువాపు నివారణకు 15 ఏళ్లున్న చిన్నారులు తప్పకుండా జేఈ వ్యాక్సినేషన్ టీకాను తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యాకేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఓల్డ్ అల్వాల్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆయన జేఈ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.



జేఈ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్